ఒక్క వర్షానికే..!



బురదమయంగా ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం

ఎడతెరిపి లేకుండా బుధవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి ముషీరాబాద్ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిరువ్యాపారులు, పాదచారులు, వాహనదారులు వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వర్షం నీటికి బురదమయంగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాయారం మార్కెట్ చౌరస్తా నుంచి రాజాడీలక్స్ చౌరస్తా వరకు మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి రోడ్డు వేయకుండా అలాగే వదిలేశారు. దీంతో తవ్విన చోట రోడ్డు కుంగి వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. పార్సిగుట్ట చౌరస్తా, బాపూజీనగర్, వినోబానగర్ తదితర ప్రాంత ప్రజలు వర్షాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
– ముషీరాబాద్



ఇదీ రాజాడీలక్స్ చౌరస్తా దుస్థితి



పోస్టర్ ఆవిష్కరణ



సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

ముషీరాబాద్: నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు... కాంట్రాక్ట్ ఫిక్స్‌డ్‌టర్మ్ ఔట్ సోర్సింగ్‌ను రద్దు.. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని.. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లపై కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ జులై 9న సార్వత్రిక సమ్మె చేపట్టనుంది. సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యం, ఎస్ఎల్ పద్మ బుధవారం మార్క్స్ భవన్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.హన్మేష్, జిల్లా ఉపాధ్యక్షుడు లింగంగౌడ్, ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంఎస్ రెడ్డి, మహ్మద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆలోకనం - సాహిత్య విమర్శ’ గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆయాచితం శ్రీధర్, ఆచార్య ఇనాక్

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభ నిర్వహణలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం కొనసాగుతోంది. అందులో భాగంగా కల్లూరి ఆనందరావు రచించిన ‘ఆలోకనం – సాహిత్య విమర్శ’గ్రంథాన్ని బుధవారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఇనాక్ వివిధ సాహితీ ప్రక్రియలపై రచనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇనాక్ సాహితీ స్వరూపాన్ని ఆనందరావు ఆలోకనంలో విమర్శను అర్థవంతంగా వివరించారని అన్నారు. విద్యావేత్త నందిరాజు కల్యాణి మాట్లాడుతూ... ఆనందరావు విమర్శలు సహేతుకంగా ఉంటాయని అన్నారు. గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సంయుక్త, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.


వర్షకాలం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలి



వర్షపునీరు నిలుస్తున్న ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని, అధికారులు

చిక్కడపల్లి: వర్షకాలం పూర్తయ్యే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... ఫిర్యాదులు వచ్చిన వెంటనే అధికారులు వెంటనే స్పందించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. గురువారం అశోక్‌నగర్‌లోని వీధి నం.1, 2లలో హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ సిబ్బంది, ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వర్షాలకు రోడ్లపై వరద నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, శ్రీకాంత్, ఉమేష్, ఆకుల సురేందర్, సురేష్, ఆనంద్‌రావు, సాయికుమార్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

కళాశాల క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం



రెజ్లింగ్ యోధులు ధర్మతేజ, గిరిబాబుకు అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్ డా. చిరంజీవి

కాచిగూడ: కళాశాలలో క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి అన్నారు. జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న రాష్ట్ర రెజ్లింగ్ యోధులు ధర్మతేజ, గిరిబాబుకు బుధవారం ప్రిన్సిపాల్ కళాశాలలో అడ్మిషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... క్రీడల్లో పాల్గొంటూ చదువుకోవడానికి వచ్చే విద్యార్థుల పట్ల అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు. ఎక్కువ మంది క్రీడాకారులు తమ కళాశాలలో చేరడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆటల్లో చూపే ప్రతిభ పట్టుదల చదువులో కూడా చూపిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. గతేడాది తమ కళాశాల క్రీడాకారులు ఆరుగురు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఈ ఏడాది మరింత ఎక్కువ మంది విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే విధంగా ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆదర్శ వివాహంలో పాల్గొన్న వినయకుమార్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమ సమాజ స్థాపనకు కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని ఎస్‌వీకే కార్యదర్శి ఎస్. వినయకుమార్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో శెట్టిపల్లి కావ్య, నెమ్మది ఉదయ్ ఆదర్శ వివాహం జరిగింది. ఈ సందర్భంగా వినయకుమార్ మాట్లాడుతూ.. కులాంతర, మతాంతర వివాహాలు అసమానతలను తొలగిస్తాయని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం ఆకాశమంత ఎత్తు ఎదుగుతుంటే ఇంకా కుల, మత భేదాలు ఎందకని అన్నారు. కొందరు మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, ఎండీ అబ్బాస్, అనగంటి వెంకటేష్, ఎం.మహేందర్, మీనా, ఎండీ జావేద్, నాగేశ్వరరావు, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జీఓ ప్రకారం అడ్మిషన్లు జరిగేలా చూడాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: దోస్త్ కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్ పొందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి ప్రభుత్వం జారీ చేసిన జీఓకు విరుద్ధంగా ప్రైవేట్ కాలేజీలు బలవంతంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఇలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. జీఓ సమర్థవంతంగా అమలు జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాలేజీలకు ప్రభుత్వం దాదాపు రూ.6వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. వారం రోజుల్లో ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

◆ ఆరేళ్ల పోరాట ఫలితంగా 2008లో అప్పటి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం పేద విద్యార్థులు ఉన్నత విద్యను చదువుకోవాలనే ఉద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పథకం సాఫీగా కొనసాగుతూ వచ్చిందన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించడం లేదనే కారణంతో బలవంతంగా కాలేజీల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి ప్రభుత్వ జీఓ ప్రకారం అడ్మిషన్లు జరిగే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేయండి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయం అందించాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఆర్ఈహెచ్ఎస్) కేబినెట్ సమావేశంలో ఆమోదం పొందిందన్నారు. అయినా ఇప్పటి వరకు అమలుకు ఉత్తర్వులను జారీ చేయలేదని తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో బుధవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ... రిటైర్డ్ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరైందికాదన్నారు. ఈనెల చివరి వరకు పూర్తి స్థాయిలో ఈ స్కీమ్‌లను అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే అమలు చేయాలన్నారు. పీఆర్సీ రిపోర్టును తెప్పించుకొని వెంటనే అమలుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘాలతో ప్రభుత్వ పెద్దలు చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ జనరల్ సి. చంద్రశేఖర్, కోశాధికారి పి.పెంటయ్య, ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య, విశ్వనాథం, జి.శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, కార్యదర్శి ప్రభాకర్, శ్యామ్‌రావు, శరత్ బాబు, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన పెన్షనర్ల సదస్సులో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

కాలనీల్లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కృషి




అనంతరామ్‌నగర్ కాలనీవాసులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: నియోజకవర్గంలో కాలనీల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడానికి తనవంతు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. అనంతరామ్‌నగర్ కాలనీలో ఆధునీకరించిన పార్కును ఆయన బుధవారం కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లకు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి తోడ్పాటును అందించాలని కోరారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థను సైతం అభివృద్ధి చేయాలని కోరారు. వీటిపై సానుకులంగా స్పందించి కమ్యూనిటీహాల్ నిర్మాణానికి తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మహిపాల్‌గౌడ్, నలిని, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, సలహాదారులు గోపాల్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రవీణ్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి

సూర్యాపేటలో నిరుద్యోగ విద్యార్థి మహాసభ 5న

చిక్కడపల్లి: రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన సూర్యాపేటలో చేపట్టనున్న నిరుద్యోగ విద్యార్థి మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ బుధవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్, నిరుద్యోగ అభ్యర్థులు జనార్దన్, అస్మా, ఇంద్రనాయక్ మాట్లాడారు. నిరుద్యోగులు జూన్ 20న ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరుద్యోగ మహాసభ నిర్వహించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడుతుండడంతో నిరుద్యోగులు మరొక పోరాటినికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మహాసభలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రస్తుతం 400 జీపీఓ నోటిఫికేషన్, 20వేల పోలీస్ నోటిఫికేషన్, డీఎస్సీ, గురుకులం, డిప్యూటీ డైరెక్టర్ నోటిఫికేషన్‌లను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థులు రాము, కృష్ణ, వెంకటేశ్, కృష్ణ, నగేష్ పాల్గొన్నారు.



నిరుద్యోగ విద్యార్థి మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బక్క జడ్సన్, నిరుద్యోగులు

న్యూజెర్సీలో ఎస్‌పీబీ మ్యూజిక్ అకాడమీ ఏర్పాటు

చిక్కడపల్లి: ప్రముఖ సినీగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకొని ఆయన పేరిట అమెరికా న్యూజెర్సీలో ఎస్‌పీబీ మ్యూజిక్ అకాడమీని ఏర్పాటు చేశామని వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ గూడూరు, ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి బుర్రలు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీగాయకులు పాల్గొని బాలు ఆలపించిన గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశానికి న్యూజెర్సీ యుటిలిటీస్ కమిషనర్ చివుకుల ఉపేంద్ర హాజరై గాయనీగాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ హరి ఎప్పనాపల్లి, సలహాదారులు దాము గేదెల, రవి అయ్యగారి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కుమార్ రాణి, ప్రమేద్ ముసిపట్ల, రమాప్రభ, కుమార్, రాజీ, చైతన్య, శ్రీధర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు చేయూతనివ్వాలి



అంబర్‌పేట: డివిజన్‌లో చేపట్టే పలు అభివృద్ధి పనులకు చేయూతనివ్వాలని బాగ్అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి సికింద్రాబాద్ జెడ్‌సీ రవికిరణ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె జెడ్‌సీని కలిసి వినితి పత్రం సమర్పించారు. పోచమ్మబస్తీ సంజయ్‌గాంధీనగర్‌లో కమ్యూనిటీ హాల్ మరమ్మత్తులు, సీసీ రోడ్ల నిర్మాణం చేట్టాల్సి ఉందన్నారు. మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..



గాంధీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి

కవాడిగూడ: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి హెచ్చరించారు. అక్రమ పార్కింగ్, రాంగ్ రూట్, మొబైల్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన చౌరస్తాలో ఉదయం, సాయంత్రం స్కూల్ ఆటోలు, వ్యాన్లు, బస్సులను తనిఖీలు చేస్తున్నామని అన్నారు. ఆటోలో పరిమితికి మించి పిల్లలను తీసుకెళ్లొద్దని సూచించారు. ఆటో డ్రైవర్లు మద్యం మత్తులో నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. ఇందిరా పార్కు చౌరస్తా, లోయర్ ట్యాంక్ బండ్, కట్టమైసమ్మ దేవాలయం, కర్బల మైదాన్, రాణిగంజ్ చౌరస్తా, నల్లగుట్ట, కవాడిగూడ ప్రధాన రోడ్డు, లిబర్టీ చౌరస్తా, దోమలగూడ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని ఆమె తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా బీఎంఎంఎస్ రజతోత్సవాలు

కాచిగూడ: భారతీయ మరాఠా మహా సంఘ్ (బీఎంఎంఎస్) రజతోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. మాజీ ఎంపీ బీబీ పాటిల్ పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణలోని మరాఠాలు తమ వారసత్వ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తున్నారని అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా మరాఠాలు ఐక్యతను చాటుకుటున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజే రావు, శ్రీనివాస్ ఘార్గే, సుదేశ్ పాటిల్, చంద్రశేఖర్ పాండే, రాజన్, శ్రీరామ్ షిండే తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీపై జీరో ఎఫ్ఐఆర్

కాచిగూడ: రైల్వే ప్రయాణికుడి సెల్‌ఫోన్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన సురేష్ దేశ్‌పాండే (35) కాచిగూడకు రావడానికి రేణిగుంటలో రైలు ఎక్కాడు. రైలు తాడిపత్రి రైల్వే స్టేషన్ వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తి సురేష్ చేతిలోని ఫోన్ లాక్కొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును గుత్తి రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఎంబీఎస్సీ 57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన మాలదాసరి సంక్షేమ సంఘంలో మాట్లాడుతున్న బైరీ వెంకటేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళితుల్లో అత్యంత వెనుకబడిన 57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని 57 ఎంబీఎస్సీ (మోస్ట్ బ్యాక్‌వర్డ్ షెడ్యూల్డ్ క్యాస్ట్) కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరీ వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర మాలదాసరి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బైరీ వెంకటేష్ మాట్లాడుతూ.. దళితుల్లో అత్యంత వెనుకబడి ఉన్న కులాలల్లో మాలదాసరి ఒకటని పేర్కొన్నారు. ఈ కులం వారు ఇప్పటికీ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. మాలలతో సమానంగా ఉండే ఈ కులాన్ని ఉనికి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వృత్తి దూరమైన మాలదాసరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. దళితులకు ఇచ్చే అన్ని సంక్షేమ పథకాలు అట్టడుగున ఉన్న 57 కులాలకు కూడా దక్కాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలదాసరి కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మద్దెల కృష్ణయ్య, గౌరవ అధ్యక్షుడు తమటం రఘుపతి, కోశాధికారి మద్దెల తిరుపతయ్య, రాములు, వెంకట్‌రాములు, ఇమ్మడి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అడిక్‌మెట్ డివిజన్ సమస్యలను పరిష్కరించండి

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ అంజయ్యనగర్, వడ్డెర బస్తీలలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బుధవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ దీపాలు, మంచినీటి సమస్యలపై పలు ఫిర్యాదులు చేయగా వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్బూ, శ్యామ్‌సుందర్, యూనిస్, సురేందర్, సత్యనారాయణరాజు, శ్రీనివాస్, నేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

రాంనగర్ డివిజన్ రిసాల ఖుర్షిద్ జాహీలో బస్తీ దవాఖానా, కమ్యూనిటీహాల్, ప్లే గ్రౌండ్, అంగన్‌వాడీ సెంటర్లను ఏర్పాటు చేయాలని హమ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల తాము రిసాల ఖుర్షిద్ జాహీలో పర్యటించి సర్వే నిర్వహించామని ఈ ప్రాంతంలో సుమారు 12వేల మంది పేద మైనార్టీలు నివసిస్తున్నారని అన్నారు. వాళ్లకు పైన పేర్కొన్న వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఎజాజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



అంజయ్యనగర్ బస్తీలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్